

టమాట కిలో రూ.16

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టం రూ.16, కనిష్ట ధర రూ.3 ప్రకారం పలికింది.



సమగ్ర ప్రణాళికే ప్రధానం

రానున్న విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రణాళిక రూపకల్పనలో సమగ్ర శిక్ష అధికారులు తలమునకలై ఉన్నారు. నిధులు రాబట్టుకునేలా చర్యలు చేపట్టారు.

8లో



జిల్లా అంతటా బుధవారం చలితీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు లేదు. రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి.

న్యూస్‌రీల్

సత్యసాయి సేవలో జస్టిస్ సుజాత



శాంతిభవన్ వద్ద జడ్జి సుజాతకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

ప్రశాంతి నిలయం: హైకోర్టు జడ్జి వి.సుజాత సత్యసాయి సేవలో గడిపారు. బుధవారం రోడ్డు మార్గంలో ప్రశాంతి నిలయం చేరుకున్న ఆమెకు... శాంతిభవన్ అతిథి గృహం వద్ద కలెక్టర్ బసంత్‌కుమార్, స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి రాకేష్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్‌రాజు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె సాయి కుల్వంత్ సభా మందిరంలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌జె.రత్నాకర్‌రాజుతో సమావేశమై ట్రస్ట్ సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలు వీరే

కొత్తచెరువు: విశ్వకవి యోగి వేమన జయంత్యుత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలను ప్రకటించారు. వ్యాసరచన పోటీల్లో కటారుపల్లి జెడ్పీ స్కూల్‌కు చెందిన మాన్యశ్రీ ప్రథమ బహుమతి, కొత్తచెరువు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన యశ్వంత్‌కుమార్ రెడ్డి ద్వితీయ బహుమతి, నల్లమాడ బాలాజీ పాఠశాలకు చెందిన పూజకు తృతీయ బహుమతి దక్కాయి. పద్యగానం పోటీల్లో ఎనుములపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మునరతేకు ప్రథమ బహుమతి, నల్లమాడ బాలాజీ స్కూల్‌కు చెందిన పూజకు ద్వితీయ బహుమతి, కొత్తచెరువు జెడ్పీ బాలికల పాఠశాలకు చెందిన రూపకు తృతీయ బహుమతి లభించాయి. వ్యాస రచన పోటీల్లో కటారుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన అఫీసా సుల్తానా, కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు చెందిన రచిత ద్వితీయ బహుమతి, చెర్లోపల్లికి చెందిన ఎంపీయూపీఎస్ విద్యార్థిని దీపిక తృతీయ బహుమతి దక్కించుకున్నట్లు కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెన్నకృష్ణారెడ్డి తెలిపారు. విజేతలకు ఈ నెల 19న నిర్వహించనున్న యోగివేమన జయంతి ఉత్సవంలో పర్యాటక శాఖ మంత్రి రోజా చేతుల మీదుగా బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు.

'ఉపాధి'లో కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ రామాంజనేయులు

బత్తలపల్లి: ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలని, ఈమేరకు వారికి అవగాహన కల్పించాలని డ్వామా పీడీ రామాంజనేయులు ఉపాధి హామీ పథకం సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన.. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలంతా ఉపాధి హామీ పథకంలో పని చేసేలా చూడాలన్నారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో చేపట్టనున్న పనుల గురించి కూలీలకు ముందుగానే తెలియజెప్పాలన్నారు. కూలీలు పనుల కోసం వెతుక్కోకుండా గుర్తించిన పనులను కేటాయించాలన్నారు. సమావేశంలో ఏపీడీ వెంకటాచలపతి, ఎంపీడీఓ సాయి మనోహర్, ఏపీఓ కుందనం ఆదెప్ప, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో ఐదుగురి అరెస్టు

హిందూపురం: వివాహిత ఆత్మహత్య కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను బుధవారం హిందూపురం వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సీఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు. హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని మేళాపురంలో మిలాద్‌నగర్‌కు చెందిన వాణి (23) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేయడంతోనే వాణి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తల్లి సునందమ్మ ఫిర్యాదు మేరకు భర్త శ్రీనివాసులు, అత్త రాధమ్మ, మామ గోవిందప్ప, ఆడపడుచు సుజాత, సమీప బంధువు శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం నిందితులను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

అంబరం.. సాహస క్రీడా సంబరం

- ఘనంగా సాయి విద్యాసంస్థల క్రీడా సాంస్కృతిక సమ్మేళనం
- అబ్బురపరిచిన విద్యార్థుల సాహస విన్యాసాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- పాల్గొన్న కలెక్టర్ బసంత్ కుమార్, సత్యసాయి ట్రస్ట్ సభ్యులు



సాహస విన్యాసాల్లో భాగంగా అగ్నికీలల మధ్య నుంచి బైక్‌లో దూసుకువెళ్తున్న విద్యార్థి

ప్రశాంతి నిలయం: సంస్కృతిని చాటే ప్రదర్శనలు, సాహసానికి ప్రతీకగా నిలిచే విన్యాసాలు, దేశ ఔన్నత్యాన్ని చాటే నృత్య రూపకాలు..కలగలిపి సత్యసాయి విద్యాసంస్థల వార్షిక క్రీడా సాంస్కృతిక సమ్మేళనం సంబరంగా సాగింది. బుధవారం పుట్టపర్తిలోని సత్యసాయి హిల్‌వ్యూ మైదానంలో సత్యసాయి విద్యాసంస్థల 40వ క్రీడా, సాంస్కృతిక సమ్మేళనం ఘనంగా జరిగింది. ఉదయం 8 గంటలకు ప్రశాంతి నిలయం నుంచి సత్యసాయి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో బ్యాండ్‌మేళాలతో ఊరేగింపుగా హిల్‌వ్యూ మైదానం వేదిక వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక ఆసనంపై కొలువుదీర్చి ఉత్సవాలను ప్రారంభించారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమని చాటుతూ విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం సత్యసాయి డీమ్డ్ యునివర్సిటీ రిజిస్ట్రార్ సాయిగిరిధర్ యూనివర్సిటీ పతాకాన్ని ఆవిష్కరించి క్రీడా జ్యోతిని వెలిగించారు.

ఆకట్టుకున్న విన్యాసాలు..


అనంతపురం మహిళా క్యాంపస్ విద్యార్థులు బైక్ రైడింగ్‌తో ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు ప్రదర్శించారు. అగ్నికీలల మధ్య బైక్‌పై దూసుకుపోతూ నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తూ అబ్బురపరిచారు. బృందావన్, ప్రశాంతి నిలయం, ముద్దనహళ్లి క్యాంపస్ విద్యార్థులు జిమ్నాస్టిక్, హైజంప్, లాంగ్‌జంప్, మార్షల్‌ఆర్ట్స్‌లో భాగంగా కర్రసాము, కరాటే, కుంగ్‌ఫూ తదితర సాహస విద్యలను ప్రదర్శించారు. భారతీయ ఇతిహాసాల్లోని పలు ఘట్టాలను వివరించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఈశ్వరమ్మ ఇంగ్లిష్ మీడియం, సత్యసాయి ప్రైమరీ, హయ్యర్ సెకెండరీ పాఠశాలల విద్యార్థులు చక్కటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కూచిపూడి, భరతనాట్యం వంటి భారతీయ సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో కలెక్టర్ బసంత్ కుమార్, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, ఏఎస్పీ రామకృష్ణ ప్రసాద్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ రాజు, సభ్యులు నాగానంద, మోహన్, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, సత్యసాయి విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.




సాయి చిత్రపటాన్ని తీసుకువస్తున్న దృశ్యం



సంస్కృతి చాటేలా విద్యార్థుల ప్రదర్శన



పతాకాలు చేతబట్టి బైక్‌పై విద్యార్థుల విన్యాసం



కారు పైనుంచి జంప్ చేస్తున్న విద్యార్థి



క్రీడా సాంస్కృతిక ఉత్సవాల్లో వివిధ పాఠశాల విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్



క్రీడోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులతో రత్నాకర్ రాజు

గీత దాటితే వేటు తప్పదు

సిబ్బందికి డీఐజీ రవిప్రకాష్ హెచ్చరిక



మాట్లాడుతున్న డీఐజీ రవి ప్రకాష్

సోమందేపల్లి: పోలీసు శాఖ క్రమశిక్షణకు మారుపేరని, సిబ్బంది అంకితభావంతో పనిచేసి శాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేయాలని అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్ అన్నారు. ఎవరైనా నిబంధలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. బుధవారం ఆయన సోమందేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు నెల రోజుల్లో వేలం పాట నిర్వహించాలని ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు. 2017లో గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసుతోపాటు 2019లో జరిగిన వరుస చోరీ కేసుల్లో దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న 42 రోడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించిన చార్జీషీట్ వెంటనే దాఖలు చేయాలన్నారు. భూముల ధర పెరగడంతో ఎక్కువగా వివాదాలు తలెత్తుతున్నాయని, అలాంటి వాటిపై చట్టప్రకారమే చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్‌లు గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా, పేకాట కేంద్రాల నిర్వహణకు సహకరిస్తున్నారంటూ కొందరు సిబ్బందిపై ఆరోపణలు వస్తున్నాయని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

ఓడీ చెరువు: ఇంటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వీడాలని పంచాయతీ కార్యదర్శిని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) విజయ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఓడీచెరువు మండలం కొండకమర్ల సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. పంచాయతీ పరిధిలో ఇంటి పన్ను వసూళ్లు సక్రమంగా లేకపోవడంతో ఈ ప్రక్రియను వంద శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రాజశేఖర్, సచివాలయ కార్యదర్శులు శ్రీకాంత్, విశ్వనాదరెడ్డి పాల్గొన్నారు.

'జగనన్నతోడు'తో ఆర్థిక తోడ్పాటు

- జిల్లాలోని 11,634 మంది చిరువ్యాపారులకు రూ.11.63 కోట్ల లబ్ధి
- గతంలో రుణం పొందిన 19,981 మందికి రూ.48.20 లక్షల వడ్డీ జమ
- కలెక్టర్ బసంత్‌కుమార్ వెల్లడి



జగనన్న తోడు లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్, ప్రజాప్రతినిధులు

పుట్టపర్తి టౌన్ : జగనన్న తోడు పథకం ద్వారా చిరువ్యాపారులు, సంప్రదాయ వృత్తి కళాకారులకు ఆర్థిక తోడ్పాటు లభిస్తోందని కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. వీధుల్లో, రోడ్ల వెంబడి, తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకొనే వారి కోసం 'జగనన్న తోడు' కింద రూ.10 వేల చొప్పున వడ్డీలేని రుణం అందజేస్తున్నామన్నారు. 'జగనన్న తోడు' లబ్ధిదారులకు ఐదో విడత వడ్డీ జమ, 6వ విడతలో రూ.10 వేల చొప్పున రుణం అందించే కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి కలెక్టర్ బసంత్‌కుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, మెప్మా ప్రతినిధి రమాదేవి, చిరువ్యాపారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వీసీ అనంతరం గతంలోనే జగనన్న తోడు పథకం రుణాలు పొందిన వారికి రూ.48.20 లక్షల వడ్డీకి సంబంధించిన మెగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బసంత్‌కుమార్ మాట్లాడుతూ...'జగనన్న తోడు' రుణం పొందిన వారు సకాలంలో తిరిగి చెల్లిస్తే... మళ్లీ రూ.10 వేల రుణం పొందే అవకాశం ఉందన్నారు. ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత ఉండి ఎవరైనా లబ్ధి పొందకపోతే గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మాటతప్పని సీఎం జగన్..

'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ... వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో చిరువ్యాపారులు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా చూశారని, వారి ఆర్థిక స్థితి గతులను మెరుగు పరిచేందుకు 'జగనన్న తోడు' పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి మాట్లాడుతూ..చిరు వ్యాపారులు పెట్టుబడి కోసం ఎవరి వద్దా చేయి చాపకుండా ప్రభుత్వమే రూ.10 వేల రుణం అందిస్తోందన్నారు. సీఎం తీసుకున్న ఈ నిర్ణయం లక్షలాది మందికి ఆర్థిక తోడ్పాటునిస్తోందన్నారు. అంతకుముందు చిరు వ్యాపారులు ఏర్పాటు చేసిన స్టాల్‌ను కలెక్టర్, ప్రజాప్రతినిధులు సందర్శించారు. సంప్రదాయ పిండివంటలు, ఊరగాయలు, పచ్చళ్లు, సౌందర్య ఉత్పత్తులు, చేతితో తయారు చేసిన సామగ్రి చూసి వారిని అభినందించారు.

పెట్టుబడి బాధలు తప్పాయి



నేను బుక్కపట్నంలో కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నా. గతంలో పెట్టుబడి కోసం ప్రైవేటుగా అప్పులు చేసి ఇబ్బందులు పడేదాన్ని. 'జగనన్న తోడు' పథకం ఇప్పుడా ఇబ్బంది లేదు. రూ.10 వేల వడ్డీలేని రుణం సద్వినియోగం చేసుకుని వ్యాపారాన్ని వృద్ధి చేసుకున్నా. వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేకపోవడం వల్ల నాకు ఎంతో మేలు జరుగుతోంది. – నాగరత్నమ్మ, బుక్కపట్నం

మా పాలిట దేవుడు



మాలాంటి చిరువ్యాపారుల గురించి గతంలో ఎవరూ పట్టించుకోలేదు. కానీ వైఎస్ జగన్ సీఎం అయ్యాక జగనన్న తోడు పథకం తీసుకువచ్చారు. దీంతో నేను ఇంట్లోనే నడుపుతున్న కిరాణాషాపును మరింత అభివృద్ధి చేసుకున్నా. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా రూ.1.32 లక్షల లబ్ధి కలిగింది. నిజంగా జగనన్న మా పాలిట దైవంగా మారారు. – వెంకటలక్ష్మమ్మ, కొత్తచెరువు

పూచీకత్తు లేకుండా రుణాలు



నేను తోపుడు బండి మీద పూలు, పండ్లు పెట్టుకొని వ్యాపారం చేసుకుంటున్నా. గతంలో పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలను అప్పులు తెచ్చుకునే వాళ్లం. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి పూచీకత్తు లేకుండానే బ్యాంకుల ద్వారా రూ.10 వేల రుణం అందిస్తోంది. కట్టిన వడ్డీ కూడా తిరిగి చెల్లిస్తోంది. – అనిత, గణేష్ సర్కిల్, ఎనుములపల్లి

పోక్సో కేసులపై దృష్టి సారించాలి

- ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

పెనుకొండ: పోక్సో కేసుల్లో దర్యాప్తు పకడ్బందీగా చేపట్టి దోషులకు శిక్ష పడేలా చూడాలని ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక డీఎస్పీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌డివిజన్ పరిధిలో నమోదైన కేసులు, దర్యాప్తు తీరు గురించి డీఎస్పీ హుస్సేన్ పీరాను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల గురించి ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలకు తీరని నష్టం జరుగుతోందని, చిన్నచిన్న మానవ తప్పిదాలతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ వెంట సీఐ కరుణాకర్, ఎస్‌ఐలు రమేష్‌బాబు, వెంకటరమణ, నాగస్వామి తదితరులు ఉన్నారు.

గృహాల మంజూరు వేగవంతం చేయండి

- హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి

నల్లమాడ: పక్కాగృహాల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ చంద్రమౌళిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ... మండలంలో ఇప్పటివరకు 3,832 మంది పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం 2,760 మందికి ఇళ్లు మంజూరు చేసిందన్నారు. తక్కిన 1,072 మంది దరఖాస్తులనూ వెంటనే రిజిస్ట్రేషన్ చేసి వారికి కూడా ఇళ్లు మంజూరయ్యేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. నల్లమాడ మినహా తక్కిన గ్రామ పంచాయతీల్లోని జగనన్న లేఅవుట్లలో 525 పక్కాగృహాలు మంజూరయ్యాయని, లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలను ప్రారంభించాలన్నారు. మండల కేంద్రంలో స్థలం సమకూరిస్తే ఇసుక డిపో ఏర్పాటు చేసి అన్ని గ్రామాల హౌసింగ్ లబ్ధిదారులకు సరఫరా చేసేలా చూస్తామన్నారు. అలాగే రెండు రోజుల్లో సిమెంట్ సరఫరా అవుతుందని, స్టీల్ సైతం లబ్ధిదారులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఉగాది నాటికి పక్కాగృహాలను ప్రారంభించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని, ఇందుకు అవసరమైన నిధులు సైతం సిద్ధంగా ఉంచిందని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ డీఈ నాగరాజు, తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, హౌసింగ్ ఏఈ వరుణ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, నల్లమాడ టౌన్ కన్వీనర్ కదిరిసాని వేణుగోపాల్ గౌడ్, నాయకులు అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో వెనుకబడితే బ్లాక్ లిస్టులోకే



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ హరినాథరెడ్డి

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా డ్రిప్, స్ప్రింక్లర్లను అందించాలని డ్రిప్ కంపెనీల ప్రతినిధులను ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ హరినాథరెడ్డి ఆదేశించారు. లక్ష్య సాధనలో వెనుకబడిన కంపెనీలను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ సమావేశ భవన్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఏపీఎంఐపీ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పీడీలు ఫిరోజ్‌ఖాన్, సుదర్శన్, ఉద్యాన అధికారులు రఘునాథరెడ్డి, నరసింహారావు సహా రెండు జిల్లాల డ్రిప్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. పండ్లతోటలకు సంబంధించిన ప్రగతిని జిల్లాలు, డివిజన్ల వారీగా ముఖ్య అతిథి ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ హరినాథరెడ్డి సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 వేల హెక్టార్లకు డ్రిప్ పరికరాలు సరఫరా చేశామని తెలిపారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలో 16 వేల హెక్టార్లకు గాను 8,500 హెక్టార్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 10,500 హెక్టార్లకు గాను కేవలం 4,002 హెక్టార్లకు మాత్రమే డ్రిప్ పరికరాలు సరఫరా చేశారన్నారు. మొత్తం 26 డ్రిప్ కంపెనీలను కలెక్టర్ గుర్తించగా, అందులో డ్రిప్ పరికరాల లక్ష్య సాధనలో పూర్తి వెనుకబడిన అనంత బయోటెక్, అస్త, భూమి, సుజయ్, సాయిరాం, పారాగన్, కుమార్, సర్‌మెగా, సుధాకర్ తదితర కంపెనీల ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరిలా మౌనంగా ఉండిపోతే ఎలా, నాకు కంఠశోష మిగులుతుంది. సమాధానం చెప్పండి' అంటూ గట్టిగా నిలదీశారు. రైతులకు ఇబ్బంది రాకూడదన్న ఉద్దేశంతో గతంలో సరఫరా చేసిన డ్రిప్, స్ప్రింక్లర్ల బకాయిలు రూ.900 కోట్లు దశలవారీగా విడుదల చేసిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఈ ఏడాది కూడా డ్రిప్ పరికరాల పంపిణీకి సంబంధించి ప్రభుత్వ వాటాగా రూ.250 కోట్లు విడుదల చేసిందని ప్రకటించారు. రైతుల అవసరాలకు తగ్గట్టు డ్రిప్, స్ప్రింక్లర్లు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బిల్లులు ఫిబ్రవరి నెలాఖరుకల్లా పంపాలని ఆదేశించారు. ఉద్యాన శాఖాధికారులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల అధికారులను అప్రమత్తం చేసి, సకాలంలో డ్రిప్ పరికరాలు అందించేలా చొరవ చూపాలని సూచించారు.

అతిశీతలంతో అతలాకుతలం

- అగళిలో 7.7, బెళుగుప్పలో 8.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు



ఉదయం 8 గంటల వేళ రొద్దంలో కమ్ముకున్న పొగమంచు

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో అతిశీతల వాతావరణం నెలకొంది. నాలుగు రోజులుగా చలిపులి పంజా విసురుతోంది. చాలా మండలాల్లో పది డిగ్రీల లోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రధానంగా మడకశిర, హిందూపురం, కదిరి, ఉరవకొండ, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో చలితీవ్రత అధికంగా ఉంది. బుధవారం శ్రీసత్యసాయి జిల్లా అగళిలో 7.7 డిగ్రీలు, అనంతపురం జిల్లా బెళుగుప్పలో 8.5 డిగ్రీల కనిష్టం నమోదు కావడం విశేషం. ఇక మడకశిర 7.8 డిగ్రీలు, సోమందేపల్లి 8.3, నల్లచెరువు 8.6, తనకల్లు 8.8, అమడగూరు, శెట్టూరు 9.1, రొద్దం 9.3, లేపాక్షి 9.4, హిందూపురం 9.5, ఓడీ చెరువు 9.6, కంబదూరు, కొత్తచెరువు, గుమ్మఘట్ట 10, కుందుర్పి 10.1, నల్లమాడ 10.3, తలుపుల 10.5, తాడిమర్రి 10.6, విడపనకల్లు 10.8, గోరంట్ల 10.9 డిగ్రీల మేర కనిష్టం నమోదు కాగా మిగతా మండలాల్లో 11 నుంచి 15 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 27 నుంచి 32 డిగ్రీల మధ్య కొనసాగాయి.

వణికిపోతున్న జనం

కనిష్ట ఉష్ణోగ్రతలతో జనం గజగజ వణికిపోతున్నారు. ఉదయం 9 గంటల్లోపు సాయంత్రం 6 తర్వాత కాలు బయట పెట్టాలంటేనే జంకుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఉదయం వేళ బయటకు వస్తున్న పాల వ్యాపారులు, పేపర్ బాయ్‌లు స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు ధరిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నారులు, వృద్ధులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది

పుట్టపర్తి: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక ప్రక్రియ ముగిసింది. బుక్కపట్నంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదికగా సాగిన ఈ ప్రక్రియను జిల్లా చీఫ్ కోచ్ జగన్నాథరెడ్డి, ఎంఈఓ గోపాలనాయక్, జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ ప్రసాద్ పర్యవేక్షించారు. అండర్ 17 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21 నుంచి విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని పీడీ నాగరాజు తెలిపారు. అలాగే అండర్ 17 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28న బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

సమగ్ర ప్రణాళికకే ప్రధానం

- 2023-24 వార్షిక విద్యా ప్రణాళిక తయారీలో నిమగ్నం
- పాఠశాల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ కసరత్తు



అనంతపురం: ఏదైనా పని విజయవంతం చేసేందుకు సరైన ప్రణాళిక అవసరం. ఈ క్రమంలోనే రాబోవు విద్యా సంవత్సరానికి అవసరమైన నిధులు సమకూర్చుకునేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలను సమగ్ర శిక్ష విభాగం సిద్ధం చేస్తోంది. సమగ్ర శిక్ష పరిధిలోని కేజీబీవీలు, ఇతర సెక్టోరియల్ విభాగాలతో పాటు పాఠశాల స్థాయిలో అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు తయారు చేసే పనిలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. మండల స్థాయి, అనంతరం జిల్లా స్థాయిలో ప్రణాళికలు రూపొందించి రాష్ట్ర స్థాయికి పంపనున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రణాళిక సలహా సంస్థ ఆమోదంతో నిధులు ఖరారు కానున్నాయి. వీటి ఆధారంగానే పాఠశాలలకు నిధులు కేటాయిస్తారు. 2022-23 విద్యా సంవత్సరంలో సమగ్రశిక్ష పరిధిలోని సెక్టోరియల్ విభాగాలకు, కేజీబీవీల అభివృద్ధి, కేజీబీవీ సిబ్బంది జీతాలు, విద్యార్థినిలకు హాస్టల్ నిర్వహణ నిమిత్తం తదితర ఖర్చుల నిమిత్తం రూ.520 కోట్ల నిధులు విడుదల చేశారు. తాజాగా 2023-24 విద్యా సంవత్సరంలో గణనీయమైన నిధులు రాబట్టేందుకు విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమగ్ర శిక్ష డీపీసీ ఎం.వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో ప్రణాళిక రూపకల్పన ప్రక్రియ వేగవంతమైంది.

మైక్రో లెవల్ ప్లానింగ్‌తో ముందుకు..

రాష్ట్ర స్థాయి నుంచి పాఠశాల అవసరాలు గుర్తించకుండా, పాఠశాల స్థాయి నుంచి గుర్తించాలనేది మైక్రో లెవల్ ప్లానింగ్ ముఖ్య ఉద్దేశ్యం. ఈ క్రమంలో యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (యూ-డైస్)ను ప్రాతిపదికగా తీసుకుని పాఠశాల స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గతేడాది ఏడబ్ల్యూపీ అండ్ బీ (యాన్యువల్ వర్క్‌ప్లాన్ అండ్ బడ్జెట్)ను తయారు చేశారు. నూతన జాతీయ విద్యావిధానం -2020 నిబంధనల మేరకు ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు ఆరు విభాగాలుగా పాఠశాలలను వర్గీకరించారు. గతంలో సర్వ శిక్ష, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ వేర్వేరుగా ప్రణాళికలు రూపకల్పన చేస్తుండగా, తాజాగా వీటిని ఒకే గొడుకు కిందకు తెస్తూ సమగ్ర శిక్షగా పేరు మార్చి ప్రణాళిక రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. ఇందులో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులే కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ప్రణాళిక రూపకల్పనపై షెడ్యూల్ ..

మండలంలోని అన్ని స్కూల్‌కాంప్లెక్స్ పాఠశాలలు అదనంగా కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల ప్రణాళికలు క్రోడీకరించి క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఈ నెల 12వ తేదీలోపు పూర్తిచేయాల్సి ఉంటుంది. 16వ తేదీన మండల రీసోర్స్ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి క్లస్టర్ డెవలప్‌మెంట్‌పై చర్చించాలి. ఈ నెల 18, 19 తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్, హెచ్‌ఎంలు, మండలంలోని లైన్ డిపార్ట్‌మెంట్లతో చర్చించి మండల ప్రణాళిక పూర్తి చేయాలి.

ఫ్యాక్షన్ రాజకీయాలు పరిటాల కుటుంబానికే చెల్లు

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: ఫ్యాక్షన్ రాజకీయాలు పరిటాల కుటుంబానికే చెల్లుబాటవుతాయని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం చెన్నేకొత్తపల్లికి వచ్చిన ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఫ్యాక్షన్, వర్గకక్షలు, హత్యా రాజకీయాలకు వైఎస్సార్‌సీపీ విరుద్ధమన్నారు. రాష్ట్రంలో జగన్ సర్కార్ ఏర్పాటైన ఈ మూడున్నరేళ్ల కాలంలో తామెన్నడూ ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించలేదని గుర్తు చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీ చేపట్టిన పాదయాత్రకు జనం రాకపోడంతో నిరాశ నిస్పృహలతో పరిటాల సునీత లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల్లో గొడవలు సృష్టిస్తున్నది టీడీపీకి చెందిన వారేనన్నారు. ఏ చిన్న పాటి సమస్య తలెత్తినా విషయాన్ని పెద్దదిగా చూపించేందుకు పచ్చపత్రికలు ప్రయత్నిస్తున్నాయన్నారు. అంతేకాక సీమాంధ్ర, రాయలసీమ వాసులకు వరి అన్నం రుచి చూపించింది ఎన్టీఆర్ అంటూ పచ్చపత్రికల్లో కథనం ప్రచురించడాన్ని తప్పుబట్టారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి, ఎంపీపీ అంజలి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ముస్సిపల్ అధికారులపై కేసు నమోదు

- కోర్టు ఆదేశాలతో కమిషనర్‌తో పాటు మరో ఐదుగురిపై నమోదు చేసిన హిందూపురం పోలీసులు

హిందూపురం: హిందూపురం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుతో పాటు మరో ఐదుగురు అధికారులపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... ఆరు నెలల క్రితం హిందూపురంలోని హౌసింగ్‌బోర్డులో ఓ స్థలాన్ని మున్సిపాల్టీ రిజర్వ్ సైట్‌గా చూపుతూ అధికారులు కంచె తొలగించి స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ స్థలం తనదని, దానిని కొనుగోలు చేశామని చెప్పినా మున్సిపల్ అధికారులు వినకుండా స్వాధీనం చేసుకున్నారని, దీనిపై తనకు న్యాయం చేయాలంటూ న్యాయస్థానాన్ని అవర్థ దేవరాజ్ ఆశ్రయించారు. కేసు విచారణను స్వీకరించిన న్యాయస్థానం రెండు రోజుల క్రితం మున్సిపల్ అధికారులపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. దీంతో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరావుతో పాటు అప్పటి టౌన్‌ప్లానింగ్ అధికారులు రాజశేఖర్, మంజుల, నాగభూషణ, సాయినాథ్, అశ్వర్థనారాయణపై సీఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు.

ఆ స్థలం మున్సిపాలిటిదే


స్థలం మున్సిపాలిటీదేనని చూపుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

రికార్డుల మేరకు మారుతీ లేఔట్‌లోని సర్వే నంబర్ 397/2బిలో ఉన్న 16వ పాట్లు (12.07సెంట్ల స్థలం) పూర్తిగా మున్సిపాల్టీదేనని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం రాత్రి ఆయన తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. 1987లో రామలింగయ్య అనే వ్యక్తి 1.27 ఎకరాల్లో లేఔట్ వేశారన్నారు. ఈ క్రమంలో లేఔట్ అప్రూవల్ చేసే సమయంలో నిబంధనల మేరకు 12.07 సెంట్ల స్థలాన్ని ఓపెన్ సైట్‌గా మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్ కింద ఇచ్చారని గుర్తు చేశారు. దీనికి 1990లో అప్పటి కౌన్సిల్ ఆమోదం కూడా ఉందన్నారు. దీంతో అన్యాక్రాంతమైన మున్సిపల్ స్థలాన్ని కాపడడంలో భాగంగా 2021 డిసెంబర్‌లో కంచె వేయించినట్లు తెలిపారు. అయితే ఆ కంచెను అవర్థ దేవరాజ్ స్వయంగా తొలగించి ఆక్రమించుకున్నాడని, ఇందుకు సంబంధించి సీసీ ఫుటేజీల ఆధారంగా 2022 జనవరిలో అవర్థ దేవరాజ్‌పై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు కూడా నమోదు చేశారన్నారు. ఈ నెల 21న హిందూపురం కోర్టులో ఈ కేసుపై హియరింగ్ ఉందన్నారు. ఈ క్రమంలో కేసు నుంచి తమను తాము కాపాడుకునేందుకు బోగస్ పత్రాలతో కోర్టును దేవరాజ్ ఆశ్రయించి, కేసు నమోదు చేయించారని, దీనిపై అన్ని ఆధారాలు న్యాయస్థానానికి తాము సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

'నవోదయ'లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం: నవోదయ విద్యాలయ సమితిలో ఆరో తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు ఆర్జేడీ ఎం.వెంకటకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 31వ తేదీలోపు నవోదయ విద్యాలయ సమితి వెబ్ సైట్ (www.navodaya.gov.in) లో దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలి. రిజిస్ట్రేషన్ రెండు దశల్లో ఉంటుంది. రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ తప్పనిసరిగా ఉండాలి. 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు హెచ్‌ఎం/ప్రిన్సిపాల్ జారీ చేసిన స్టడీ సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేయాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3,4వ తరగతి చదివి ఉత్తీర్ణత సాధించిన, జూలై 01, 2011 నుంచి ఏప్రిల్ 30, 2013 మధ్య జన్మించిన వారు అర్హులు.

వంద శాతం లక్ష్య సాధనే ధ్యేయం

- ఫీజు వసూళ్లపై సిబ్బందిని ఆదేశించిన మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ రామాంజనేయులు

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా పరిధిలోని 17 మార్కెట్ కమిటీలకు నిర్దేశించిన ఫీజు వసూళ్లు వంద శాతం పూర్తి చేయాలని మార్కెటింగ్ సిబ్బందిని ఆ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) రామాంజనేయులు ఆదేశించారు. మార్కెట్ ఫీజు వసూళ్లకు సంబంధించి బుధవారం అనంతపురంలోని మార్కెట్‌యార్డులో ఉన్న ఆ శాఖ కార్యాలయంలో రెండు జిల్లాల ఏడీలు పి.సత్యనారాయణచౌదరి, ఎల్ఎన్ మూర్తితో కలసి యార్డు సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో ఆయన సమీక్షించారు. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో రెండు నెలలే గడువు ఉందని, ఈ నేపథ్యంలో నిర్దేశిత ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యానికి తావివ్వరాదన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 8 కమిటీల ద్వారా రూ.5.24 కోట్లకు గానూ 52 శాతంతో రూ.2.70 కోట్లు మాత్రమే వసూలైందన్నారు. రాప్తాడు, కదిరి, పుట్టపర్తిలాంటి కమిటీల పరిస్థితి ఆశాజనకంగా ఉన్నా తనకల్లు, పెనుకొండ కమిటీల పురోగతి ఆశించిన స్థాయిలో లేదని అసహనం వ్యక్తం చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం


బియ్యం నిల్వలు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ధర్మవరం: అక్రమంగా కర్ణాటకకు తరలించేందుకు నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... అందిన సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ రామారావు, ఎస్ఐ శేషగిరి, ఆర్ఐ రమాదేవి, సిబ్బంది బుధవారం ఉదయం ధర్మవరంలోని గూడ్స్‌షెడ్ కొట్టాలలోని ఓ గోదాములో తనిఖీలు చేపట్టారు. కర్ణాటక ప్రాంతానికి తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. బియ్యం నిల్వ చేసిన మనేరి శంకరయ్యపై కేసు చేసినట్లు విజిలెన్స్ సీఐ రామారావు తెలిపారు.

ఫలించిన సెంటిమెంట్ మంత్రం

- దున్నపోతు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం
- పోలీసుస్టేషన్ వేదికగా పంచాయితీ
- చివరి క్షణం వరకూ పట్టువీడని అంబాపురం, రచ్చుమర్రి గ్రామస్తులు
- దేవుడిపై ప్రమాణాలు, టాస్‌ల దాకా వెళ్లి తగ్గిన వైనం
- రెండు గ్రామాల వారికి సర్దిచెప్పిన సీఐ యుగంధర్


అంబాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ యుగంధర్

కణేకల్లు: ఒకట్రెండు రోజులు కాదు... ఏకంగా 20 రోజులకు పైగా తీవ్ర ఉత్కంఠకు తెరలేపిన అమ్మవారి దున్నపోతు సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. అందుబాటులో ఉన్న ఒకేఒక దున్నపోతుతో అంబాపురం, రచ్చుమర్రి గ్రామస్తులు ఊరిదేవర జరుపుకునేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దున్నపోతు తమదంటే తమదంటూ ఇరు గ్రామాల ప్రజలు వాగ్వాదానికి దిగి 20 రోజులుగా ఉత్కంఠకు తెరలేపారు. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకూ ప్రముఖులు, రాజకీయ నాయకులు పంచాయితీ చేశారు. అయినా ఇరు గ్రామాల ప్రజలు సర్దుకోలేదు. చివరకు మండల పోలీస్ స్టేషన్ నుంచి సర్కిల్ కార్యాలయం వరకూ వెళ్లారు. అయినా ఎటూ తేలలేదు. చివరకు ఈ అంశంలో తమకు న్యాయం చేయాలంటూ రచ్చుమర్రి వాసులు పోలీసు స్పందన కార్యక్రమంలో ఏఎస్పీ నాగేంద్రుడు ద్వారా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన జిల్లా పోలీసు అధికారి ఆదేశాల మేరకు రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్ రంగంలో దిగి బుధవారం కణేకల్లు పోలీస్ స్టేషన్‌కు ఇరు గ్రామాల ప్రజలను రప్పించుకుని మాట్లాడారు.

అసలేం జరిగిందంటే...

ఈ నెల 17న అంబాపురంలో దేవర నిర్వహించాలని గ్రామస్తులు నిశ్చయించిన నేపథ్యంలో అమ్మవారి పేరుతో వదిలిన దున్నపోతు కోసం దాదాపు 30 రోజులకు పైగా వివిధ ప్రాంతాల్లో గాలించి చివరకు బొమ్మనహాళ్ మండలంలో కనిపించిన దేవరపోతును తీసుకెళ్లి బందులదొడ్డిలో బంధించారు. ఈ విషయం తెలుసుకున్న రచ్చుమర్రి గ్రామస్తులు అంబాపురానికి వెళ్లి దున్నపోతును పరిశీలించి అది తమ గ్రామ దేవత పేరున వదిలిందేనని నిర్ధారించి, మీరేలా బంధిస్తారంటూ అంబాపురం వాసులతో వాదనకు దిగారు. అప్పటి నుంచి ఈ రెండు గ్రామాల మధ్య దున్నపోతు పంచాయితీ నలుగుతూ వస్తోంది. ఈ ప్రాంతంలో ఉన్నది ఒకేఒక్క దున్నపోతు కావడంతో ఈ అంశాన్ని రెండు గ్రామాల ప్రజలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దున్నపోతు తమదంటే తమదంటూ పట్టుబట్టారు.

ఎటూ తేల్చని నాలుగు గంటల పంచాయితీ..

ఇరు గ్రామాల ప్రజలను బుధవారం కణేకల్లు పోలీస్ స్టేషన్‌కు సీఐ యుగంధర్ పిలిపించుకుని మాట్లాడారు. ఒక్కో గ్రామం నుంచి 80 నుంచి 90 మంది ప్రజలు తరలిరావడంతో పోలీస్ స్టేషన్ కిటకిటలాడింది. ఈ నెల 17న అమ్మవారి దేవర జరిపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నామని, ఈ పరిస్థితుల్లో దున్నపోతును వదులుకునేది లేదంటూ అంబాపురం వాసులు వివరించారు. అయితే తమ గ్రామ దేవతకు సంబంధించిన దున్నపోతును అంబాపురం వాసులు బంధించారని ఎలాంటి పరిస్థితుల్లోనూ తాము వదులుకోబోమని రచ్చుమర్రి వాసులు తేల్చి చెప్పారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పంచాయితీ... మధ్యాహ్నం 1 గంట వరకూ సాగింది. సమస్యకు పరిష్కారం దక్కకపోవడంతో ఇరువైపులా ఐదుగురు చొప్పున గ్రామ పెద్దలను స్టేషన్ లోపలకు పిలుచుకెళ్లి సీఐ చర్చించారు. అయినా ఏకాభిప్రాయం కుదరలేదు. బయట ఉన్న ఊరి జనంతో చర్చించి ఏ విషయం చెబుతామని గ్రామ పెద్దలు బయటకు వచ్చేశారు. అనంతరం ఎవరికి వారు ఆ దున్నపోతు తమదంటే తమదంటూ దేవుడిపై ప్రమాణాలు చేశారు. చివరకు టాస్ వేసి తుది నిర్ణయం తీసుకోవాలనుకున్నారు. అయితే టాస్ వేస్తే తమకు అన్యాయం జరుగుతుందనే ఆందోళన ఇరు గ్రామాల ప్రజల్లో తలెత్తి చివరకు ఈ అంశాన్ని కూడా విరమించుకున్నారు.

సెంటిమెంట్‌తో రాజీ కుదిర్చిన సీఐ..

చివరగా సీఐ యుగంధర్ ఇరు గ్రామాల పెద్దలను కూర్చొబెట్టి చర్చలు జరిపారు. ఈ నెల 17న అంబాపురంలో దేవర ఉందని, రచ్చుమర్రిలో దేవరకు ఇంకా ఏడాది గడువు ఉండడంతో దున్నపోతు కొనుగోలుకు అంబాపురం వాసులతో డబ్బి ఇప్పిస్తానన్నారు. డబ్బు తీసుకుంటే తమ గ్రామ దేవతను వారికి అమ్ముకున్నట్లవుతుందని, ఆ డబ్బుతో వారే ఓ దున్నపోతును కొనుక్కొని దేవర జరుపుకునేలా చూడాలని రచ్చుమర్రి వాసులు అన్నారు. ఇది దైవ కార్యం కావడంతో అందరికీ మంచి జరుగుతుందని, మరో ఏడు రోజుల్లో ఊరి దేవర ఉండడంతో మంచి మనసుతో ఆలోచించి అంబాపురం వాసులకు సహకరించాలని, దీంతో అమ్మవారు కూడా శాంతిస్తారని, అంతేకాక రెండు గ్రామాల మధ్య శాంతిభద్రతలు నెలకొంటాయని సీఐ నచ్చచెప్పారు. చివరి అస్త్రంగా సీఐ ప్రయోగించిన సెంటిమెంట్ అస్త్రం రచ్చుమర్రి వాసులను ఆలోచనలో పడేసింది. చివరకు అంబాపురంలో దేవర ముగిసిన తర్వాత ఓ దున్నపోతును కొనిస్తామంటూ ఆ గ్రామస్తులు భరోసానివ్వడంతో ఇరు గ్రామాల మధ్య రాజీ కుదిరింది. ఎట్టకేలకు దున్నపోతు సమస్యకు పరిష్కారం దక్కడంతో అంబాపురం వాసులు హర్షం వ్యక్తం చేశారు.